క్లుప్తంగా

ఉద్యోగుల కృషితోనే ఆర్టీసీ మనుగడ


ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న డీఎం షేక్ షబ్బం

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల సమష్టి కృషితోనే ఆర్టీసీ మరింత మనుగడ సాధించగలదని డిపో మేనేజర్ షేక్ షబ్బం అన్నారు. అక్టోబర్‌లో అధిక ఆదాయం, డీజిల్ ఆదా సాధించిన డ్రైవర్లు, కండక్టర్లు, అలాగే ఉత్తమ పనితీరు కనబరిచిన మెకానిక్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందించే కార్యక్రమాన్ని శనివారం రాజమహేంద్రవరం డిపో గ్యారేజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను గుర్తించి, ప్రతి నెలా ప్రోత్సాహక బహుతులు అందజేస్తున్నామన్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల ప్రయోజనార్థం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని డిపో మేనేజర్ షేక్ షబ్బం తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు వెల్లడించారన్నారు. బస్సుల్లో వెనుక సీట్లలో కూర్చునే ప్రయాణికుల సౌలభ్యం కోసం హ్యాండిల్స్ ఏర్పాటు చేయాలని కోరారన్నారు. నగరంలో సిటీ బస్సులు నడపాలని కొందరు సూచించారని, అయితే గతంలో నడపగా ప్రయాణికుల ఆదరణ లేక నష్టాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో సిటీ బస్సులు నడిపే అవకాశం లేదన్నారు.

మేకప్ప చెరువు రోడ్డు ముంపు సమస్యకు మోక్షం


శుభ్రం చేసిన మేకప్పచెరువు రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మేకప్పచెరువు రోడ్డు ముంపు సమస్యకు మోక్షం లభించింది. గత కొద్ది నెలలుగా హుకుంపేట, పిడింగొయ్యి గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి మురుగు నీరు, వర్షపు నీరు మేకప్ప చెరువులోకి చేరుతుంది. ఈ నీరు చెరువు నుంచి బయటకు వెళ్లకుపోవడంతో గతంలో రైతులు పొలంలో నుంచి గాడి తీసి బయటకు పంపించేవారు. మళ్లీ యథాస్థితికి చేరడంతో హుకుంపేట గ్రామం నుంచి పాములగుడి వైపు వెళ్లేరోడ్డు మురుగునీరుతో నిండిపోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామ పంచాయతీ నిధులతో మూడు రోజులుగా పొక్లెయిన్‌తో చెరువు నుంచి మురుగు నీటిని రైతులపొలాల్లో నుంచి వరలక్ష్మి కాలనీల్లోని ప్రధాన కాలువకు తరలించారు. రోడ్డుపై మురుగును తొలగించి వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశామని గ్రామ పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు తెలిపారు. ముంపు సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై అవగాహన

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంప్లాయబిలిటీ స్కిల్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. కళాశాలలో వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఎంప్లాయిబిలిటీ జస్ట్ లెక్చర్ జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ విద్యార్థి దశ నుంచి నేర్చుకోవాలన్నారు. అప్పుడే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తమిళనాడుకు చెందిన సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, వాణిజ్య శాఖాధిపతి సూరిబాబు, కొత్తపేట గవర్నమెంట్ కాలేజ్ వాణిజ్య శాఖ అధిపతి కె.సత్యనారాయణ, అధ్యాపకులు వనజారత్నం, వీరలక్ష్మి, దుర్గబాబు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం సంకీర్తన


అఖండనామ సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రపంచ వ్యాప్తంగా సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న 24 గంటల భజన కార్యక్రమంలో భాగంగా అఖండ నామ సంకీర్తన జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు తెలిపారు. రాజమహేంద్రవరం ఆల్కట్ గార్డెన్‌లోని సత్య సాయి మందిరంలో శనివారం సాయంత్రం అఖండ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ సత్య సాయి మందిరాల్లో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకూ భజనలు నిరంతరంగా ఉంటాయన్నారు. సత్యసాయి గురుకులం కరెస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, జోనల్ పదాధికారులు త్రిమూర్తులు, నారాయణరావు, హనుమంతరావు, దివాకర్ పాల్గొన్నారు.

ప్రమిదలు వెలిగిద్దాం..
పర్యావరణాన్ని కాపాడుదాం

- హరిత దీపావళికి స్వాగతం
- మార్కెట్లో ఎకోఫ్రెండ్లీ టపాసులు
- కొనుగోలు చేస్తే మంచిదంటున్న ప్రకృతి ప్రేమికులు


ఎకోఫ్రెండ్లీటపాసులు


ప్రమిదల వెలుగులు

రాజమహేంద్రవరం రూరల్: అమావాస్య చీకటిని జయించి సంతోషాలు నింపే పండగ దీపావళి. ఆదివారం నరకచతుర్దశి(దీపావళి) సందర్భంగా ఆనందోత్సాహాల మధ్య కాంతుల పండగను జరుపుకొనేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలో పర్యావరణ పరిరక్షణకు ఎకోఫ్రెండ్లీ టపాసులు వినియోగించాలని పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా వెదజల్లాలంటే జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అపశ్రుతి చోటు చేసుకోకుండా ప్రకృతికి మేలు చేసేలా సంతోషంగా దీపావళిని జరుపుకోవాలని కోరుతున్నారు.

ఎకోఫ్రెండ్లీతో..

రంగులు విరజిమ్ముతూ పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అందరినీ ఆకట్టుకునే టపాసులు లేకుండా దీపావళి పండగ పూర్తి కాదనుకుంటారు. అలాంటి వారి కోసమే ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. కాన్ఫెట్టీ, ఫ్లవర్‌పవర్, ఫేక్‌నోట్, బర్స్ట్, స్నేకిమిక్స్, ఫ్లవర్‌పార్క్స్, పెన్సిల్ లాంటి పేర్లతో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవి మామూలు బాణసంచాలా వాతావరణానికి పెద్దగా హాని కలిగించవు. వీటి ధ్వని పరిమిత దూరం వరకే ఉంటుంది. కాలుష్యం కలిగించకుండా రంగుల మెరుపులను వెదజల్లుతాయి. కేవలం గన్ పౌడర్, ఫాస్ఫేట్‌ను మాత్రమే ఉపయోగించి ఆధునిక టెక్నాలజీతో ఈ-వెరైటీ బాణసంచాను తయారు చేస్తున్నారు.

ప్రమిదలే ముద్దు

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచడం, ఇంటికి విద్యుత్తు కాంతులు వెదజల్లేలా అలంకరణ చేసుకోవడంతో పాటు వివిధ ఆకృతుల్లో ఉండే ప్రమిదల్ని వెలిగించాలి. ఒక వేళ పిల్లలు బాణసంచా కావాలని మారం చేస్తే వాటిని కాల్చడం వల్ల కలిగే నష్టాల్ని వివరించి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాలి.

టపాసుల్లో ఏముంటాయి

బాణసంచా తయారీలో కాపర్, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, జింక్, సోడియం, అల్యూమినియం, అమ్మోనియం, పొటాషియం, సల్ఫర్, బొగ్గు వాడతారు. ఒక్కో టపాసును తయారు చేసేందుకు ఒక్కో రసాయనాన్ని వినియోగిస్తారు.

అందరికీ ముప్పు

టపాసుల్ని కాల్చినప్పుడు అందులోని రసాయనాలు మండి విషపూరిత వాయువులు విడుదలవుతాయి. వాటిని పీల్చితే చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

'సుప్రీం' సూచనలు

పూర్తిగా బాణసంచాను కాల్చడం నిషేధించాలంటూ గతంలో ముగ్గురు చిన్నారుల తరపున వారి తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేశారు. బాణసంచాను పూర్తిగా నిషేధించడం అసాధ్యమని ఉన్నత న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంటూ కొన్ని పరిమితులు విధించింది. ఎట్టిపరిస్థితుల్లోనూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో టపాసులను కాల్చరాదని, భారీ శబ్దాలు చేసే వాటిని కాల్చకూడదని సూచించింది. ప్రత్యేకించి పండగ రోజుల్లో రాత్రి 8 నుంచి 10 గంటల వరకూ మాత్రమే బాణసంచా కాల్చాలని తీర్పులో ఆదేశించింది. దక్షిణాదిరాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రోజులో ఏవైనా రెండు గంటల పాటు కాల్చుకోవచ్చని సడలింపు ఇచ్చింది. బాణసంచాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిందిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించింది.

రసాయనాల వల్ల కలిగే ఇబ్బందులు

రసాయనం	సమస్య
కాపర్	చిరాకు కలుగుతుంది
కాడ్మియం	రక్తప్రసరణలో ఇబ్బంది ఏర్పడుతుంది.
సీసం	నరాల వ్యవస్థపై ప్రభావం
మెగ్నీషియం	మానసిక స్థిమితం కోల్పోయే ప్రమాదం
జింక్	జ్వరం, వాంతులు
సోడియం, బేరియం	కాలడం(బర్న్స్)

పదార్థం	ఎందుకువాడతారు	ప్రభావం
యాంటీమోనిసల్ఫైడ్	మిలమిల మెరిసేందుకు	విషపూరిత పొగ
బేరియం నైట్రేట్	మెరిసేందుకు	విషపూరిత పొగ
కాపర్ సంబంధిత పదార్థాలు	నీలంర ంగుకోసం	పాలీక్లోరినేటెడ్‌డయాక్సిన్లు డైబెంజోఫ్యూరాన్లు
లీథియం	ఎర్రనికాంతులకోసం	అలర్జీకి కారణమయ్యేపొగ
మెర్క్యురీ	క్లోరిన్‌డోనర్	ప్రమాదకర భారలోహం
పొటాషియంనైట్రేట్	నల్లనిపొడి	విషపూరితమైనదుమ్ము, సల్ఫర్ విడుదల
సల్ఫర్‌డయాక్సైడ్	వాయువులు వెలువడేందుకు	ఆమ్లవర్షాలకు కారణం

పర్యావరణ హితంగా..



దీపావళి పండగను ప్రమాదాల బారిన పడకుండా జరుపుకోవాలి. పండగ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించేందుకు పర్యావరణహితంగా నిర్వహించుకోవాలి. మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలను వెలగించడం మంచిది. నెయ్యి దీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుంది. సాంప్రదాయంలో భాగంగా టపాసులు కాల్చుకుంటాం. కానీ ఎకోఫ్రెండ్లీ టపాసులు కాలిస్తే పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. ఇవి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

– బి.సందీప్‌రెడ్డి, ఈఈ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, కాకినాడ

మార్కండేయేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్‌ఐ: లోక కల్యాణం కోసం పార్వతీ పరమేశ్వరులకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించినట్టు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గోదావరి గట్టున గల మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఎంపీ భరత్ రామ్, సతీమణి మోనా, కుమార్తెలు జయాని, శివాన్షి రామ్, తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, సోదరుడు విజయ కృష్ణ పూజలు చేశారు. ఏటా దీపావళికి ముందు రోజు ఎంపీ భరత్ తన కుటుంబ సభ్యులతో స్వామికి పూజలు చేయడం ఆనవాయితీ. కాగా.. దేవస్థానం చైర్మన్ యిన్నమూరి ప్రదీప్(దీపు) ప్రత్యేక పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలను ఎంపీ భరత్‌రామ్ దంపతులు నిర్వహించారు. తొలుత గోదావరి మాతకు కుంకుమార్చన, నూతన వస్త్ర సమర్పణ చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ పవిత్ర గోదావరి జలాలను కలశంతో ఆలయానికి తీసుకువచ్చి స్వామికి అభిషేకించారు. ఎంపీ మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో మెగా పోర్టస్ చెక్

2476 కేసుల నమోదు, రూ.16.71 లక్షల వసూలు


చెక్ నిర్వహిస్తున్న రైల్వే కమర్షియల్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు, టికెట్ లేని ప్రయాణాలను నివారించేందుకు శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో మెగా పోర్టస్ చెక్ నిర్వహించారు. విజయవాడ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు నేతృత్వంలో 101 మంది రైల్వే కమర్షియల్ సిబ్బంది, 10 మంది ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి చెక్ నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ రెండు విడతల్లో నిర్వహించిన ఈ తనిఖీల ద్వారా 2,476 కేసుల నమోదు చేసి రూ.16.71లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు రాంబాబు తెలిపారు. ఈ పోర్టస్ చెక్ ద్వారా టికెట్ లేని ప్రయాణాలు నివారించడంతోపాటు ప్రమాదకర వస్తువుల రవాణా, పట్టాలు దాటడం ప్రమాదం, యూటీఎస్ వాడకం, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వాడకంపై ప్రయాణికులకు అవగాహన కలిగించామన్నారు. ఈ చెక్‌లో ఏసీఎం రవివర్మ, విజయవాడ సీటీఐ జనరల్ చంద్రమోహన్, రాజమహేంద్రవరం సీటీఐ చంద్రమౌళి, తుని, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లకు చెందిన స్క్వాడ్ సీటీఐలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో రిషిత ప్రతిభ

ప్రకాశం నగర్: ఏలూరు జిల్లా వట్లూరులో జరిగిన అండర్-13 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నగరానికి చెందిన కోరుకొండ రిషిత ప్రతిభ చూపి విజేతగా నిలిచినట్టు జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జి.వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 80 మంది బాలికలు పాల్గొన్న ఈ పోటీల్లో మొత్తం ఏడు రౌండ్లు నిర్వహించారు. ఏడు రౌండ్లలో రిషిత ఆరు పాయింట్లు సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుందన్నారు. డిసెంబర్ 4 నుంచి 10 వరకూ హైదారాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి చదరంగం పోటీలకు రిషిత పాల్గొంటుందని తెలిపారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: ప్రజా సమస్యలే ఏజెండాగా సీపీఎం ఈ నెల 15వ తేదీన సీపీఎం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. శనివారం స్థానిక శ్యామలసెంటర్ లో సీపీఎం ప్రజారక్షణ భేరి, బహిరంగ సభ పోస్టర్‌ని సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సభకు పార్టీ అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు పాల్గొంటారని తెలిపారు.

జనవరిలో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జనవరి 8 9 10 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక అంబల సూర్యారావు భవన్‌లో రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. బీజేపీ అవలంబిస్తున్న కర్షక, కార్మిక సామాన్య ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సభలు నిర్వహిస్తున్నట్టు కేవీవీ ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జ్యోతిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మధు, కోనసీమ జిల్లా కార్యదర్శి సత్తిబాబు ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన స్థానిక తాడితోట జంక్షన్ వద్ద శనివారం జరిగింది. హుక్కుంపేటలోని గణేష్‌నగర్‌కు చెందిన సిద్దా ఆదినారాయణ(69) రోజూ మాదిరిగానే ఇస్కాన్ టెంపుల్‌కి వెళ్లి వస్తుండగా తాడితోట జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలిపిన ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. మృతుడు రిటైర్డ్ అధ్యాపకుడు, అతనికి ముగ్గురు కుమార్తెలు అమెరికా ఉంటుండగా భార్యతో ఆదినారాయణ స్థానికంగా నివాసముంటున్నాడు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కడియం: ఈనెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభంకానున్నట్టు స్థానిక గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవినిర్మల తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, 16న గ్రంథాలయ ఉద్యమకారులు, స్ఫూర్తి ప్రదాత సంస్మరణ సభ, చిత్రలేఖనం పోటీలు, 17న జీవిత కాల సభ్యత్వ నమోదు, ఆటల పోటీలు నిర్వహిస్తారన్నారు. 18వ తేదీ వక్తృత్వ పోటీలు, 19న జాతీయ మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలు, అక్షరాస్యతా దినోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రకాశం నగర్: దానవాయిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ, మహిళా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి అబ్బిరెడ్డి చంద్ర పద్మాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి


ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యాశాఖాధికారులు


అబుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్‌ఓ నరసింహులు తదితరులు

కంబాలచెరువు: భారతదేశ స్థితిగతులను మార్చి అభివృద్ధి పథంలోకి నడిపేది విద్యేనని గుర్తించిన బహుముఖ ప్రజ్ఞాశాలి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ అన్నారు. స్థానిక కోటగుమ్మంలో ఉన్న జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో శనివారం మౌలానా జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానిక విద్యాశాఖ కార్యాలయాధికారులు, సిబ్బంది పూల మాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. నారాయణ మాట్లాడుతూ సమాజ రుగ్మతలకు, వెనుకబాటు తనానికి కారణం సరైన విద్య లేకపోవడమేనని, 14 ఏళ్ల వరకూ ఉచిత నిర్బంధ విద్యను ప్రవేశపెట్టాలని కోరిన విద్యా దార్శనికులు అబుల్ కలామ్ ఆజాద్ అన్నారు. మౌలానా జయంతి నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌లు వి.వెంకట్రాజు, ఎ.ఛాయాదేవి, సూపరింటెండెంట్ రాజకుమారి, ఏఎస్ఓ.ప్రసాద్, డీఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, సీఆర్పీ జయంతి శాస్త్రి డిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని విద్యా దినోత్సవంగా జరుపుకొంటున్నామని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్లు బైబిల్ బోధనలు, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్ ఖురాన్, బైబిల్, హిందుత్వంలో విద్యాకు ఇస్తున్న ప్రాముఖ్యతపై ప్రసంగించారు. డి.ఆర్వో జి.నరసింహులు మాట్లాడుతూ ఆజాద్ హయంలో ఎన్నో విద్యా సంస్కరణలు జరిగాయన్నారు. జిల్లా విద్యా అధికారి ఎస్.అబ్రహం మాట్లాడుతూ భారత దేశంలో అత్యున్నత బోధనా పద్ధతులు తీసుకొచ్చారన్నారు. ఐఐటీకి ఆయనే మూల కారకుడు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మైనార్టీ సంక్షేమ ప్రతినిధులు, ఇమామ్‌లు, ఫాస్టర్లు, మదర్స విద్యార్థులు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: స్థానిక ఆజాద్ చౌక్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు హబీబుల్ల ఖాన్, ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రా కేసరి డిగ్రీ కళాశాల చైర్మన్ షేక్ అసదుల్ల అహమద్ కార్యక్రమంలో ఆజాద్ సేవలను కొనియాడారు. దరూల్ ఉలుమ్ విద్యార్థులకు హబీబుల్ల పుస్తకాలు పొంపిని చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శాహిష్‌రబ్బానీ, ఖాన్ బాబు, సిటి కేబుల్ చాన్ బష్‌నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Pursuant to the instructions of my client, Kodati Rajagopal S/o China Bala Swamy of Hyderabad, the rightful owner of the scheduled property, it has come to my client's attention that his brother, Kodati Mohana Venkata Ramana Rao and his son, are attempting to transfer the scheduled property unlawfully. My client filed a suit in O.S.No.68 of 2023 before the I Addl Senior Civil Judge, Rajamahendravaram, against the aforementioned Kodati Mohana Venkata Ramana Rao, which is currently pending. Despite my client's pending suit and rightful claim, the said Kodati Mohana Venkata Ramana Rao and his son are attempting to sell the scheduled property. The public is notified that any transaction involving the scheduled property will not be binding on my client.

SCHEDULE PROPERTY

East Godavari District, Rajamahendravaram District Registrar office, Rajamahendravaram Municipal Corporation ward No.1, Alcot Gardens, Ambika Nagar, T.S.No.1089, Plot No.45, 500 sq yards in which an extent of Ac 134.16 sq yards of site and house bearing Door No.2-50-10 bounded on :

East : Joint property of Plaintiff, defendant, Kodati Veera Venkata Satyanarayana Murthy, Kodati Pardhasaradhi; **South** : House wall of G.Bhimarao, V.Bujjibabu; **West:** Defendant house bearing Door No.2-50-11; **North:** Road

Within the boundaries an extent of 134.16 sq yards of house and site and with all easement rights

Anaparthi Veerabhadrarao
Geedam Rajukumar, Advocates
Rajamahendravaram. Cell : 9848621000